# కాలమ్ దాటని కథ

## స్కోరు

సమయం ఉదయం తొమ్మిదిన్నర కావస్తోంది. బహుశః నాకు ఆఫీసుకి సమయం అప్పటికే అయిపోవడం మూలంగా వడివడిగా అడుగులేస్తున్నాను. అప్పటి వరకూ బెన్సన్ అండ్ హెడ్జెస్ వన్ డే పోటీ టీవీలో చూసి ఇక తప్పదన్నట్లు బలవంతంగా ఆఫీసుకి బయలుదేరాను.

నేను వచ్చేటప్పుడు నా అభిమాన క్రికెట్ ప్లేయర్ రవిశాస్త్రి బ్యాటింగ్ చేస్తున్నాడు. అప్పటివరకు పెద్దగా పరుగులు ఏమీ చేయలేదు. కాని, అతను ఆడుకుంటూ వేగం పుంజుకుంటాడు.

నా మనసంతా స్కోర్‌పైనే వుంది. ఎంత వుందో తెలుసుకోవాలన్న అభిలాష. అప్పుడు నాకు దాదాపు పది గజాల దూరంలో ఒక అబ్బాయి చెవి దగ్గర రేడియో పెట్టుకుని వింటు న్నాడు. బహుశా కామెంట్రీ అయివుంటుంది.

అతను సంతోషంతో అటూ, ఇటూ ఊగిపోతున్నాడు. అంటే రవిశాస్త్రి బౌండరీలు, సిక్సర్‌లు కొడుతున్నాడు కాబోలు. నాకు సంతోషం వేసింది. తొందరగా అతడి దగ్గరకి వెళ్లి 'స్కోరెంత?' అన్నాను.

'ముద్దు మీద ముద్దు పెట్టు' అన్నాడు అతను కళ్లు మూసుకుని ఏదో లోకంలో వున్నట్టు.

నాకు చెంపమీద చెళ్లున చరిచినట్లయ్యింది. మళ్లీ అడిగాను 'స్కోరెంత?' అని.

'రగులుతోంది మొగలి పొద' అన్నాడు అతను. ఇతనేదో పిచ్చి కేసనుకుని రేడియో దగ్గర నేనూ ఓ చెవిని పడేసేను. అంత సేపు అక్కడ నిలబడి సమయం వేస్ట్ చేసుకున్నందుకు నన్ను నేనే ఇంగ్లీషులో నాలుగు అక్షరాల్తో తిట్టుకున్నాను.

అతడు వివిధ భారతిలో తెలుగు పాటలు వింటూ డిస్కో డాన్స్‌లు చేస్తున్నాడు! అచ్చు తెలుగువాడు!!

— పురుమాండ్ల నరసింహారెడ్డి

# బాలచంద్రిక



వి.కశ్యప్ - రామకృష్ణాపురం

## విరబూసిన పువ్వులు

బాలలమూ పూబాలలమూ
భారత భావి ప్రణాళికలం!

మధురమైనవి మా వచనమ్ములు
మలినము లేనివి మా హృదయమ్ములు
భరతు డొసగినవి మా శౌర్యమ్ములు
మోదభరితమే మా చరితమ్ములు!

భారతి టాగూర్ బంకించందూ
రాయప్రోలు పాటలలోని పల్లవులం!
అన్నమయ్య పురి త్యాగరాజుల
ఆలాపనలకు చరణాలం!
రుద్రమ ఝాన్సీ శౌర్యమునంతా
ఉగ్గుపాలుగా తాగిన వారము
మొల్ల సరోజిని కవితా సరసిని
మెల్ల మెల్లగా లేచిన అలలము!

గౌతమబుద్ధ వివేకానందుల
ఆదర్శాలకు నిదర్శనాలం!
గాంధీతాతా చాచానెహ్రూ
కనిన కలలకు వారసులం!
దేశ సంస్కృతీ సంస్కారాలను
నిగ్గుదేల్చగా నిలిచిన వారము
భారత కీర్తి పరీమళాలకు
ప్రతీకనై విరబూసిన పూవులం!

- పులికంటి కృష్ణారెడ్డి

# కాలమ్ దాటని కథ

## ప్రిస్టేజి కోసం

ఆరోజు ఏదైనా సినిమా కెళ్ళాలను కొని థియేటర్ చేరుకొన్నాను. జేబులో 2.50 పైసలున్నాయి. ఆ థియేటర్లో 2.00 రూపాయల టికెట్టు వుండటంతో దానికే పోదామని నిర్ణయించుకున్నాను. అందులో నేషనల్ అవార్డులు వచ్చిన, పాత సినిమా కావటం జనం తక్కువగా వున్నారు. అయినా వెధవ ఇగోకు జడిసి చుట్టూ ఓసారి చూసి తెలిసిన వాళ్ళెవరూ లేరని నిర్ధారించుకొని 2 రూపాయల టికెట్టుకొని, టాకీసు ఎదురుగా వున్న టీ బంకు దగ్గర నిల్చున్నా సినిమా ప్రారంభించాక వెళ్ళొచ్చని.

అదే సమయంలో నాకు తెల్సిన ఫ్రెండొకడు, బాల్కనీ క్యూలోకి వెళ్తూ నన్ను చూసి వస్తా వుండమని, చెప్పి వెళ్ళాడు. నాకు బేజారయి నట్టయింది. డబ్బేమో లేదు. టికెట్టు అమ్మేద్దామనుకుంటే, కొనే వాళ్ళు లేరు. ఇలా డీలాపడి నేనుండగానే, టికెట్టు తీస్కొని వచ్చేసాడు. సదరు మిత్రుడు, ప్రసాద్. రాగానే 'ఏంగురూ, సినిమా కొస్తావా? అన్నాడు 'సారీ గురు చూసేసాను' అన్నాను తప్పించు కోవటానికి. 'అయితే ఎందుకొచ్చావు. టికెట్టెందుకూ?' అన్నాడు. నేనా జోకు రిసీవ్ చేసుకొనే స్థితిలో లేను.

ఇంతలో సినిమా ఆరంభ సూచనగా బెల్లు మోగింది. ప్రసాదు వస్తానని లోపలికెళ్ళి పోయాడు. నేను కాస్సేపాగి, టైటిల్స్ పడుతున్నప్పు డెళ్ళాను. చీకట్లో తడుము కుంటూ వెళ్ళి ఓ ఫ్యాన్ క్రింద కూర్చొన్నాను. నా ప్రక్క నెవరో వున్నారు. అక్కడక్కడా ఒకరొకరు కూర్చొన్నారు అంతే.

హఠాత్తుగా ఫిల్మ్ కట్ అవటం వల్ల అనుకుంటాను సినిమా ఆగి లైట్లు వెలిగాయి. మామూలుగా, ప్రక్కనున్న వ్యక్తిని చూద్దును కదా- వాడెవరో కాదు, ప్రసాద్! వాడు నన్ను చూసి స్టన్ అయి, నవ్వేసి--బాల్కనీ క్యూలో నిలుచుని ఆ చివర నుండి బయటకెళ్ళి 2 రూపాయలు టికెట్టు కొని, బయట కొచ్చినట్లు చెప్పి, నవ్వటం ప్రారంభించాడు. నేనూ నవ్వు ఆపు కోలేక పోయాను.

పి.వి.రవికుమార్